www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 జులై 2025
5
వైఎస్ఆర్



ఫిర్యాదుదారులకు త్వరితగతిన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కడప : పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి కలెక్టర్‌తోపాటు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎర్రగుంట్ల మండలం ప్రకాష్ నగర్‌కు చెందిన ఆమె తమ పిల్లలు ఆర్‌టిఇ యాక్టు కింద ఆన్‌లైన్‌లో విజ్ఞాన్ విద్యానికేతన్ ప్రయివేట్ పాఠశాలలో తల్లికి వందనం నగదు జమకాలేదని, అర్జీని పరిశీలించి పథకం మంజూరు చేయాలని కోరారు.

భిక్షాటన చేస్తూ కార్మికుల నిరసన

- కార్పొరేషన్ ఆస్తిని నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు కడప కార్పొరేషన్ ఆస్తిని నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ మనోజ్ రెడ్డి దృష్టికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ తీసుకువెళ్లారు. సోమవారం కార్పొరేషన్ ఎదుట భిక్షాటన చేస్తూ ఇంజినీరింగ్ కార్మికులు నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దతు తెలియజేస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.21వేలు, రూ.24,500 వేతనాలు ఇవ్వాలని సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. 2 నెలలుగా అనేక రూపాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. కార్పొరేషన్‌లోని అధికారులు ప్రయివేట్ వ్యక్తుల ద్వారా, పైపులు మీద అవగాహన లేని వారితో పనిచేయిస్తూ కార్పొరేషన్ ఆస్తిని ధ్వంసం చేస్తున్నాని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సమ్మె చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. కార్మికుల వేతనాలు పెంచి సమ్మెను నివారించాల్సిన అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించకుండా ప్రయివేట్ వ్యక్తులతో రూ. 1000 నుంచి రూ 2500 వరకు చెల్లించి కార్పొరేషన్ డబ్బులు అప్పనంగా ఇవ్వడం సరైంది కాదన్నారు. ముఖ్యంగా పైప్ లైన్ మీద అవగాహన లేని వారితో పని చేయించడం వల్ల కోట్ల ఆస్తి నష్టం జరిగే ప్రమాదముందని చెప్పారు. కొంతమంది అధికారులు గుత్తి వర్కర్ల ద్వారా పనిచేయించుకుని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను బెదిరించి భయాందోళన సృష్టించడం సరైంది కాదన్నారు.

సమ్మెకు సంపూర్ణ మద్దతు : మేయర్

కార్మికులు చేస్తున్న సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మేయర్ సురేష్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని చెప్పారు.



కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న మేయర్ సురేష్‌బాబు

వేతనాల పెంపునకు ప్రభుత్వం అంగీకారం : టిడిపి

వేతనాల పెంపుకు ప్రభుత్వ అంగీకరించిందని, కార్మికుల విధుల్లోకి వెళ్లాలని టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మెలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు బ్రహ్మారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, విజయభాస్కర్, నగర ప్రధాన కార్యదర్శి,కేశవ, పవన్, ఉదయ్, ఆనందు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : కరోనా సమయంలో పనిచేసిన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు బంగారు రెడ్డి, ఆయిల్ మిల్ ఖాజాలకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో 95 మందిని కార్మికులుగా విధుల్లోకి తీసుకున్నారని చెప్పారు. అప్పట్లో రోజు కూలీ రూ.400 ఉండేదని ఆ వేతనం సరిపోవడం లేదని చెప్పారు. ఇప్పట ిధరలకు అనుగుణంగా రోజుకు రూ. 570 ఇవ్వాలని కోరారు. ఈ ధరను అప్పట్లో కౌన్సిల్ సమావేశంలో అంగీకరించారని వారు గుర్తు చేశారు. అంతేగాక కొబ్బరి నూనె సబ్బులు చెప్పులు యూనిఫామ్ ఇస్తామని కమిషనర్ మాటిచ్చినట్లు వారు గుర్తు చేశారు. చైర్పర్సన్ కార్మికులకు న్యాయం చేస్తామని మాటిచ్చినట్లు వారు తెలిపారు. మున్సిపల్ సంఘ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ పాల్గొన్నారు.

వీడనున్న విద్యార్థిని హత్య మిస్టరీ

అన్నలే చంపినట్లు నిర్ధారణ !
రెండు, మూడు రోజుల్లో పూర్తి సమాచారం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పర్యాటక కేంద్రమైన గండికోటలో ఈ నెల 14న చోటు చేసుకున్న ఇంటర్ విద్యార్థిని హత్య కేసు 90 శాతం కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో 100 శాతం కేసు ఛేదించి ప్రెస్ మీట్ ద్వారా వెల్లడి చేసేందుకు పోలీసులు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. మిగిలిన 10 శాతం ఆధారం రాబట్టే పనిలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు అంటే 8 రోజులు నుండి పోలీసులు కంటిమీద కునుకు లేకుండా విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో పలు మార్లు గండికోటలో సెల్ సిగ్నల్స్ పైన, సిసి పుటేజీలపైనా ఆధారపడి చేశారు. గ్రూప్‌లుగా విడిపోయి చేసిన విచారణలో విద్యార్థి హత్య వెనుకాల సొంత అన్న బ్రహ్మయ్య, చిన్నాన్న కుమారులు కొండయ్య, సురేంద్ర , తల్లిదండ్రుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థిని మృతదేహాన్ని మొదట పోలీసులకు ఆచూకీ చూపింది కొండయ్య అని, రాత్రి అక్కడే బస చేసారని కూడా ప్రాథమిక ఆధారాలను రాబట్టినట్లు సమాచారం. కూతురు, లేదా చెల్లెలు అవమానానికి గురిచేస్తుందని అందుకే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా గండికోట హత్య కేసు త్వరలో వీడనున్నట్లు చెబుతున్నారు.



తనిఖీ నిర్వహిస్తున్న డ్వాగ్ స్క్వాడ్ (ఫైల్‌ఫోటో)

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

రిజర్వ్ ఫారెస్ట్‌కు కేటాయించవద్దు
వ్య.కా.స డిమాండ్



నిరసన తెలియజేస్తున్న వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కాశినాయన మండల పరిధిలోని నాయన పల్లె రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 129, 130, 217 ప్రభుత్వ భూమి స్థానిక గ్రామాలైన వరి కుంట్ల నాయనపల్లె నిరుపేదలకు భూమి పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వరికుంట్ల గ్రామ ప్రజలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ నాయన పల్లె సర్వేనెంబర్ 129, 130, 217 ప్రభుత్వ భూమిలో అగ్రవర్ణాలు, పెత్తందారులు, భూ కబ్జాదారులు దౌర్జన్యంగా వైసిపి అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూములు సాగు చేశారని పేర్కొన్నారు. వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని స్థానిక పేదలు, వరికుంట్ల నాయన పల్లె గ్రామాల నిరుపేదలకు కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూ పంపిణీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రిజర్వ్ ఫారెస్ట్ కేటాయించాలనే ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. గ్రామాలలో వలసలు నివారించాలంటే పేదలకు మూడు ఎకరాల చొప్పున భూములు ఉండాలన్నారు. లేనియెడల వలసలు పెరుగుతాయని తెలిపారు. నివారించాలంటే ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు చొప్పున భూ పంపిణీ అమలు చేయాలని కోరారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా భూ పంపిణీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ పేదలకు భూ పంపిణీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య, మధు, కాశినాయన మండల అధ్యక్షులు వరికుంట్ల బాబు, దాసు, జయన్న, గురువయ్య, మహిళలు పాల్గొన్నారు.



తలపడుతున్న చిత్తూరు, అనంతపురం జట్లు

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్- 16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ప్రారంభమైన చిత్తూరు, అనంతపురం మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆదినారాయణ రెడ్డి 44, సాత్విక్ 38 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని దినేష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు. తేజస్ రెండు, నిహాల్ మాలిక్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 184 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మహమ్మద్ షారిక్ అక్తర్ 81 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ నాలుగు, కిరణ్ కుమార్ నాలుగు వికెట్లు తీసుకున్నారు.



ఆరు వికెట్లు తీసుకున్న దినేష్

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన కడప, నెల్లూరు మ్యాచ్ ఉత్కంఠగా సాగుతుంది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 29.3 ఓవర్లలో 78 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. కడప జట్టులోని కశ్యప్ రెడ్డి 5, గైబు 5 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 38.4 ఓవర్లలో 140 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లోకేష్ 55 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సుశాంత్ 3, చైతన్య 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. కడప జట్టులోని గైబు మూడు వికెట్లు తీసుకున్నాడు

ఫిర్యాదు దారులకు న్యాయం చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (పరిపాలన) కె. ప్రకాష్ బాబు, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

మైనర్లకు రూములు ఇవ్వరాదు : డిఎస్‌పి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : అద్దెకు గదులను ఇచ్చే యజమానులు మైనర్లకు ఇవ్వరాదని జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సాయంత్రం గండికోటలోని అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అకాడమీలో గండికోటలోని రిసార్ట్స్ కలిగిన యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రూములు ఇచ్చేటప్పుడు తప్పకుండా రిజిస్టర్‌లో ఆధార్ కార్డు , ఫోన్ నంబర్లు, ఇతర పూర్తి సమాచారం నమోదు చేయాలన్నారు. మైనర్లకు రూములు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్క రూమ్‌కు సిసి కెమెరాలు ఉండాలన్నారు. రోజూ రాత్రి 9 గంటలకు రూములలో ఉండే యాత్రికుల వివరాలను ఔట్ పోస్ట్‌లో ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అర్బన్ సిఐ లింగప్ప, రిసార్ట్స్ యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

అచ్యుతానందన్ మరణం

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ సిపిఐ(ఎం) నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్ (102) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో తిరువనంతపురంలోని ఎస్‌యుటి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించడం బాధాకరమని, ఆయన మృతి దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం తెలిపారు. వృద్ధాప్యం కారణంగా కొంతకాలంగా ఆయన పూర్తి విశ్రాంతిలో ఉంటున్నారని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలో చీలిక వచ్చిన తర్వాత సిపిఎంను స్థాపిం చడంలో అచ్యుతానందం ఒకరని తెలిపారు. వి.ఎస్. అచ్యుతానందన్ కేరళ ముఖ్యమంత్రిగా, మూడుసార్లు ప్రతిపక్ష నేతగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. 2006-11 మధ్యకాలంలో ఆయన కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి 1980 నుంచి 1991 వరకు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీకి రెగ్యులర్ ఆహ్వానితులుగా ఉన్నారని, ఆయన మరణం బాధాకరమని తెలిపారు.

సహకార బ్యాంకులను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

రైతులు ప్రాథమిక సహకార బ్యాంకులను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డి పల్లె సహకార బ్యాంకు చైర్మన్‌గా గంధం మోహన్‌బాబు ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగిరెడ్డి పల్లె ప్రాథమిక సహకార బ్యాంకు పరిధిలో మూడు వేల మంది రైతులు సభ్యత్వాలు ఉండగా కేవలం 950 మంది రైతులు రుణాలు తీసుకుని ఉన్నారని చెప్పారు. మిగతా రైతులు కూడా రుణాలు తీసుకొని సకాలంలో తిరిగి చెల్లించి బ్యాంకు పురోగతికి పాటుపడాలన్నారు. త్వరలో గాలేరు నగరి కాలువలు పూర్తి చేసి చింతకొమ్మదిన్నె మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని వారు భరోసానిచ్చారు. అనంతరం నాగిరెడ్డిపల్లి పిఎసిఎస్ చైర్మన్‌గా మోహన్ బాబు సభ్యులుగా గురు ప్రసాద్, బాలిరెడ్డి చేత డిసిఒ వెంకటసుబ్బయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గం జనసేన నాయకులువేణుగోపాల్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి హరి ప్రసాద్, కమలాపురం నియోజకవర్గం టిడిపి ఆరు మండలాల కన్వీనర్లు నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమెరికాలో సత్తా చాటిన కలసపాడు యువకుడు

- ప్రతిష్టాత్మక అవార్డు స్వీకరణ

ప్రజాశక్తి-కాశినాయన

అమెరికాలో కలసపాడు యువకుడు సత్తా చాటాడు. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో ప్రతిష్టాత్మక పాత్ర పోషించి పలు ప్రాజెక్టులలో పరిశోధనలు చేశారు. అమెరికా దేశంలోని ప్రతిష్టాత్మక టకా అవార్డు విజేతగా నిలిచి పలువురికి ఆదర్శంగా మారారు. కలసపాడుకు చెందిన కామిశెట్టి చిన్న సత్యనారాయణ రంగలక్ష్మమ్మల కుమారుడైన కామిశెట్టి సాయి నితేష్ చిన్న వయసులోనే పలు శాస్త్రీయ పరిశోధనలు పూర్తి చేసి గొప్ప ప్రతిభ చాటారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొంది, పలు అవార్డులు స్వీకరించారు. నితేష్ యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిగా నిలిచి వారిలో ప్రేరణ కలిగిస్తున్నారు. నితీష్ బిటెక్ హైదరాబాదులోని గోకరాజు రంగరాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం వరంగల్ నిట్‌లో పీజీ, పిహెచ్‌డి పూర్తి చేసి రీసైకిల్ అగ్రిగేడ్స్ స్టీల్ ఫైబర్స్‌పై పరిశోధనలు చేసి డాక్టరేట్ స్వీకరించారు. అనంతరం అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీలో చేసిన పనులు పరిశోధనలకు గాను టెక్సాస్ అగ్రిగేట్ అండ్ కాంక్రీట్ అసోసియేషన్ టకా సంస్థ నుంచి కాంక్రీట్ ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన రంగంలో అవార్డులు పొందడం పై పలువురు నితీష్‌ను ప్రశంసించారు.



సాయి నితేష్

విభిన్న ప్రతిభావంతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇటీవల కాలంలో కొందరు దళారులు మూడు చక్రల స్కూటర్లు తక్షణం అందిస్తామని హామీ ఇచ్చి, శారీరక విభిన్న ప్రతిభావంతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి ఆర్.వి.కృష్ణ కిషోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఇటువంటి వదంతులను నమ్మకుండా, మోసపోకుండా అత్యంత జాగ్రత్త వహించగలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు చక్రల స్కూటర్ల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ఆదేశాలు కానీ, బడ్జెట్ కేటాయింపులు కానీ చేయలేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు, కేటాయింపులు పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ విషయమై పూర్తి సమాచారం పత్రికా ప్రకటనల ద్వారా తెలియజేస్తామన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాది పూర్తయిందని తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో విద్యార్థులకు అనేక హామీలు మంత్రి నారా లోకేష్ ఇచ్చారని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జీవో నంబర్ 77 రద్దు చేస్తామని చెప్పి ఇప్పటివరకు దానిమీద స్పష్టమైన హామీ ఇవ్వలేదని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన విద్యార్థులకు ఫీజు నెంబర్స్మెంట్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులుకు సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న తల్లికి వందనం, విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు ఇవ్వాలని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక, ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులు దగ్గర నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. వీటిని అరికట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 9,10వ తరగతి చదువుతున్న బాలికలకు సైకిలు ఉచితంగా ఇవ్వాలని పేర్కొన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని చెప్పారు. సంక్షేమ హాస్టల్‌లో కూడా నాడు- నేడు పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, జిల్లా వ్యాప్తంగా అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలనీ, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టు వర్కర్స్, పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేసే కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, నగర కార్యదర్శి మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్,విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్లకు పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప : పాస్టర్లకు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని ఎపిపిఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ డిమాండ్ చేశారు. కడప నగరం చిన్న చౌక్ అశోక్ నగర్ క్రైస్ట్ ప్రేయర్ చర్చిలో సోమవారం ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని టిడిపి ఐటి మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం క్రైస్తవ పాస్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గత ఎన్నికల హామీలో భాగంగా యువగలం పాదయాత్రలో క్రైస్తవ పాస్టర్లకు లోకేష్ హామీ ఇచ్చారు అన్నారు. పైగా ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పాస్టర్లకు క్రైస్తవ సంక్షేమ పథకాలు పొందుపరిచారన్నారు. ఇప్పటికీ హామీలు. అమలుకు నోచుకోక పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎపిపిఎఫ్ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు బిషప్, కె. శ్యామ్యూల్‌బాబు, సలహాదారులు బిషప్ దేవన్న, ఉపాధ్యక్షులు. బోనం ప్రభుదాస్, సంఘటి జోసెఫ్, ఎద్దుల కుమార్, మల్లెం విజయ శేఖర్, కోఆర్డినేటర్ బ్రదర్ అరుణ్ కుమార్, ట్రెజరర్ సుభాకర్, సీనియర్ పాస్టర్ కే. దానం బాబు, చార్లెస్ విజయ్ కుమార్, రమేష్ బాబు, కె డేవిడ్ రాజు, పాస్టర్లు పాల్గొన్నారు.

జీవ ఎరువుల ప్రాముఖ్యతపై పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో జీవ ఎరువులు - వాటి ప్రాముఖ్యత రైతులకు తెలియజేసి, వాటిపై అవగాహన పెంచేలా రాష్ట్ర వ్యవసాయ శాఖ వారు ప్రచురించిన పోస్టర్లను జెసి అదితిసింగ్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో పోస్టర్లను జెసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. చంద్రా నాయక్ మాట్లాడుతూ జీవ ఎరువులైన ఫోస్పోరాస్ సోలుబులైసింగ్ బ్యాక్టీరియా, పోటాషియం సోలుబులైసింగ్ బ్యాక్టీరియా, అజోస్పైరిల్లమ్, రైజోబియం వాడకం గురించి తెలిపారు. వీటిని వాడటం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. బయో కంట్రోల్ ల్యాబ్‌లో తయారు చేసే సుడోమోనస్, ట్రైకోడర్మ వీరిడి లాంటి జీవన శిలీంద్రాల గురించి చెప్పారు. జీవన ఎరువులు వేసిన 20 - 30 శాతం మాత్రమే పంట వినియోగించుకుని మిగిలిన 80 - 70 శాతం భూమిలో స్థిరీకరించబడి పంటలకు అందుబాటులో లేకుండా పోతుందన్నారు. ఇటువంటి పోషకాలను జీవ ఎరువులు అందుబాటులోనికి తీసుకొస్తాయన్నారు. నేల సారం పెంపు, నేల నిర్మాణం పటిష్టం, ఆరోగ్యకరమైన నేల, నేలలో పోషకాల వృధ తగ్గింపు, సాగు ఖర్చుల తగ్గింపు, 25 శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఇది ఎకరాకు రెండు కిలోల వ్యవసాయ పంటలైన కంది, వరి, వేరుశనగ, జొన్న మొదలైనవి వాటికి ఉపయోగించాలని పేర్కొన్నారు. అదే ఉద్యానవన పంటలైతే ఎకరానికి ఐదు కిలోల పశువుల ఎరువులతో కలిపి వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్ర నాయక్ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ పీడీపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐసిడిఎస్ పీడీపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బిల్డింగ్స్ దాదాపు 1059 ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కేంద్రాల నిర్వహణ కోసం ఒక్కొక్క సెంటర్‌కు రూ. 3వేలు ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. దాదాపు రూ.31,80,000 ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. వీటి పైన విచారణ చేసి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పవను, ఉదయ్ పాల్గొన్నారు.

ఆర్ఐఒగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఆదేశాల మేరకు టి.ఎన్. వి వెంకటేశ్వర్లు నూతన ఆర్ఐఒగాగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

కడప ఉక్కు పరిశ్రమను వెంటనే నిర్మించాలి

ప్రజాశక్తి - కడప : రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీని సెయిల్ ఆధ్వర్యంలో చేపట్టి వెంటనే పూర్తి చేయాలని ఎఐసిసి కమిటీ మెంబర్ సుంకర పద్మశ్రీ, కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్, గుండ్లకుంట శ్రీరాములు, ఎఐసిసి కో-ఆర్డినేటర్ ఎస్ఎ. సత్తార్, మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ మూర్తి డిమాండ్ చేశారు. విభజన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కడప జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు శ్యామల, రమణ, నాసిర్ హుస్సేన్, నాసిర్ ఖాన్, పిఎండి అక్రమ్, జానకిరామ్, అన్వర్, చాంద్ బి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప :

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పుట్టినరోజు సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక అల్ షిఫా మానసిక వికలాంగుల కేంద్రంలో అక్కడి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేసి వారికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే పార్టీకి చిరస్మరణీయమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన సేవలు పార్టీకి మరెంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్‌బాషా, రఫీ ఖాన్, పార్టీ నాయకులు హరిప్రసాద్, రహంతుల్లా, సంజయ్ కాంత, రాజ్ భాష, ముబారక్, అల్ షిఫా డైరెక్టర్ రఫీ పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న అలీఖాన్



ప్ల కార్డ్స్ పట్టుకొని నిరసన తెలుపుతున్న చైర్మన్, కౌన్సిలర్లు

అధికారుల్లేక ఆగిపోయిన పనులు

- వెంటనే అధికారులను నియమించాలి : మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపాలిటీ పరిధిలో అధికారుల్లేక పనులు ఆగిపోయాయని, వెంటనే ఆయా శాఖలకు సంబంధించి అధికారులను నియమించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం వారు మున్సిపల్ కార్యాలయం వద్ద ప్లకార్డు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో మేనేజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, డిఇ, ఎఇ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తద్వారా పనులు ఆగిపోయాయని తెలిపారు. గతంలో స్వచ్ఛ మున్సిపాలిటీగా రెండు అవార్డులు తీసుకున్నామని, అధికారులు లేకనే మూడోసారి అవార్డు రాలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడం వల్లే అధికారులను నియమించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులను నియమించాలన్నారు. పట్టణంలో పారిశుధ్యం, డ్రెయినేజీ, వీధిలైట్లు తదితర పనులు ఆగిపోయాయని తెలిపారు. వెంటనే అధికారులను నియమిం చాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కో-ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, కౌన్సిలర్లు కిషోర్, భార్గవి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లాడుపల్లె అభివృద్ధికి కృషి

- ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని వీరభద్ర స్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం అన్నదానం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటున్నారన్నారు. ఆలయానికి వచ్చినవారు ఆకలితో ఇంటికి వెళ్లొద్దన్నదే తమ ఆశయమన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో భవిష్యత్‌లో అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయానికి మరింత శోభను తీసుకొస్తామన్నారు. దాతలు కూడా అన్నదాన కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మేకల బాబు, గుత్తి నారాయణ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు

గౌతమ్, సెయింట్ మేరీస్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని గౌతమ్ హైస్కూల్, సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్ ఆఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇండ్ల జయరాజ్ కోరారు. ఆ మేరకు ఆయన సోమవారం ఎంఇఒ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించడంలో ఆయా పాఠశాలలు నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. విద్యా హక్కు చట్ట ప్రకారం జీవో నెంబర్ ఒకటికి అనుగుణంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. అవేమీ పట్టకుండా తాము పెట్టిన నిబంధన ప్రకారమే పాఠశాల నడవాలని యాజమాన్యం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. గౌతమ్ స్కూల్ ఆవరణలో పాడుబడిన రేకుల షెడ్ ప్రమాదకరంగా ఉండడం, గ్రౌండ్‌గా స్కూల్ యాజమాన్యం వినియోగిస్తోందన్నారు. ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ మీనాక్షి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ ఆఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇండ్ల జయరాజ్, రాయలసీమ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బందెల ఓబులేసు, ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేష్, సంఘాల నాయకులు బయన్న, ప్రవీణ్, చంద్ర పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సరైన పత్రాల్లేని వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల రింగ్ రోడ్డులో పట్టణ సిఐ చాంద్‌బాషా తన సిబ్బందితో సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులను ఆపి హెల్మెట్ గురించి అవగాహన కల్పించారు. ఇన్సూరెన్స్ డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి చెక్ చేశారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రతల గురించి వివరించారు. సరైన పత్రాల్లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఏసుక్రీస్తు విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ముద్దనూరు : జమ్మలమడుగు రహదారిలోని పులికోన ఘాట్ రోడ్డు వద్ద ఉన్న ఏసుక్రీస్తు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని జమ్మలమడుగు తాలూకా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ముద్దనూరు పాస్టర్ల అసోషియేషన్ అధ్యక్షులు పాస్టర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. దెబ్బతిన్న విగ్రహాన్ని వారు పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం రమేష్‌రెడ్డి, ప్రభాకర్ ఆధ్వర్యంలో పాస్టర్లు, క్రైస్తవులు ఎస్ఐ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఏసుక్రీస్తు విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించడం దారుణమన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు విజయ్ కుమార్, ఏసుపాదం, ప్రభుదాస్, సామాజిక కార్యకర్త జాకోబ్ బాబు, అడ్వకేట్ భాస్కర్ బాబు, యువకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కుక్కల బెడదతో ప్రజలు బెంబేలు

పిల్లలను పాఠశాలకు, బయటకు పంపాలంటే జంకుతున్న తల్లిదండ్రులు



వికాస్ పాఠశాల వద్ద గుంపులుగా వేచి ఉన్న కుక్కలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. పిల్లలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. పిల్లలను కుక్కలు కాటు వేసిన సందర్భాలు అధికం అవుతుండడంతో వాటిని చూసి పాఠశాలలకు వెళ్లే చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. వేంపల్లెలోని బిడ్డాల మిట్ట, శ్రీరాంనగర్, గరుగువీధి, యూనియన్ బ్యాంకు ప్రాం తాలతోపాటు ఆయా ప్రాంతాల్లో కుక్కలు విప రీతంగా రోడ్డుపై తిరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మోటర్ బైకులో వెళ్లే వారిని, పాద చారులను కుక్కలు వెంట పడుతున్నాయి. కుక్కలు వెంట పడడంతో మోటర్ బైకులో వెళ్లే వారు కింద పడి గాయాలు పాలై ఆసుపత్రులకు వెళుతున్నారు. తల్లి దండ్రులు పనులు మానుకొని తమ పిల్లలను పాఠశాల వద్ద విడిచి పెట్టి వస్తున్నారు. వేంపల్లెలోని బిడ్డాల మిట్ట ప్రాంతంలో ఉన్న వికాస్ పాఠశాల బయటే కుక్కల మంద ఉండడంతో పిల్లలు పాఠశాలకు వెళ్లేలేక ఇంటి వద్దనే ఉంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఎక్కడ చూసిన కుక్కలు గుంపులుగా ఉండి దాడులు చేస్తున్నట్లు స్థానికులు హడలిపోతున్నారు. కుక్కల బెడదతో బయటికి రావాలన్నా రాలేక పోతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అధికారులకు కుక్కల బెడద ఎక్కువగా ఉందని తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వేంపల్లెలో తిరుగుతున్న కుక్కలను పట్టి బయటి ప్రాంతాల్లో విడిచి పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్త దానం చేసి ప్రాణదాతలు కావాలని బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్, మైదుకూరు తహశీల్దార్ నరేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం మైదుకూరు పట్టణంలో స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ చంద్రమోహన్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు వద్దని, యువత ముందుకు రావాలన్నారు. తహశీల్దార్ నరేంద్ర మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే రక్తదానం పునర్జన్మ ణిస్తుందన్నారు. ఈ సందర్భంగా సంతోష్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యంను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, కౌన్సిలర్ కుర్రా రాధాకృష్ణ, జెబివిఎస్ వ్యవస్థాపకుడు అశోక్, యువత పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఆర్‌డిఒ చంద్రమోహన్


సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలి

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సుపరి పాలన, ప్రజా సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం కుంభకోణంలో వెలుగు చూస్తున్న విషయాల ద్వారా జగన్ పులివెందుల పరువు, కడప జిల్లా పరువు తీయడంతోపాటు ముఖ్యమంత్రి పదవికి కళంకం తెచ్చాడని ఆవేదన వెలిబుచ్చారు. తాగుబోతుల రక్తంతో ప్రభుత్వాలను నడపాలని, రాజకీయాలు చేయాలని అనుకోవడం సిగ్గు చేటన్నారు. మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులుగా మద్యం పాలసీ తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం, తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న సొమ్ము తిరిగి మద్యం షాపులకు చేరుతోందన్నారు. తాగుడు మన సంస్కృతికి వ్యతిరేకమన్నారు. సప్త వ్యసనాలలో తాగుడు ఒకటని మహాభారతం లో విదురుడు చెప్పాడని తెలిపారు. కల్లు మానండోయ్.. కళ్లు తెరవండోయ్ అన్నాడు మహాత్ముడు అన్నారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 47కు వ్యతిరేకమన్నారు. తాగుడు ఆ వ్యక్తికి, ఆ కుటుంబానికి, ప్రభుత్వానికి, సమాజానికి నష్టమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నేరం వెనుక తాగుడు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వాలకు నిధుల కొరత ఏర్పడుతుందని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. గుజరాత్, బీహార్, మిజోరాం, నాగాలాండ్, లక్ష దీవులు సంపూర్ణ మద్య పాన నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా స్టేట్ జీఎస్టీ పెరుగుతుందని తెలిపారు. గుజరాత్‌లో రాష్ట్ర సొంత రెవెన్యూ రాబడిలో స్టేట్ జీఎస్టీ 48 శాతం, కాగా ఆంధ్ర ప్రదేశ్‌లో కేవలం 11.40 శాతం మాత్రమే అన్నారు. కారణం తాగుడు వలన కొనుగోలు శక్తి ఎపి రాష్ట్రంలో తగ్గిందని చెప్పారు. సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తే కొందరు రాజకీయ నాయకులకు మాత్రమే నష్టమని ఆయన పేర్కొన్నారు. మద్యం కుంభకోణాలు జరగకుండా ఉండాలంటే సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని తులసిరెడ్డి సూచించారు.

వేములలో ఇన్‌ఛార్జి పాలనే దిక్కు



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి - వేముల

వేముల మండలంలో ఇన్‌ఛార్జిల పాలనే దిక్కయింది. అభివృద్ధి పనులు, పరిపాలనకు ఎంపిడిఒ కార్యాలయం ప్రధానం. ఇక్కడ ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, ఎఒ వంటి ముఖ్య అధికారులు లేక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ ముద్దనూరుకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో పులివెందుల ఎంపిడిఒకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన వారానికి ఒకరోజు మాత్రమే వచ్చి వెళ్లిపోతుంటారు. ఈ నేపథ్యంలో పరిపాలన స్తంభించిపోయింది. గ్రామ సచివాలయాలు, మండల ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న అధికారుల, సచివాలయ సిబ్బందికి జీతాలు పెట్టేందుకు కూడా వీరు లేకపోవడంతో ఉద్యోగస్తులు, మండల అభివృద్ధి పనులను, సమస్యలుగానీ చెప్పుకునేందుకు వచ్చే ప్రజలు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు చాలా గ్రామ సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న చాలామంది సెక్రటరీలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారిని కూడా నియమించకపోవడంతో వచ్చిన కొత్త పంచాయతీ సెక్రెటరీలు సైతం ఇక్కడ పనిచేసేందుకు ఇష్టం లేకపోవడంతో మెడికల్ లీవ్ అంటూ సెలవుపై వెళుతున్నారు. ప్రధానమైన సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఉన్న సిబ్బందిని బదిలీలు చేయడంతో ఇక్కడికి వచ్చే సిబ్బంది బాధ్యతలు చేపట్టక మునుపే సెలవులు పెడుతున్నారు. సచివాలయాల్లో అధికారులు లేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ప్రజల అవసరాలు తీర్చేనాథుడే కలిపించడంలేదు. సకాలంలో ప్రజలకు సేవలు అందడం లేదు. కొద్దిరోజులుగా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, తల్లికివందనం తదితర వాటిని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ఇవన్నీ రానివారు తమ సమస్యలు ఎక్కడ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి పర్యవేక్షించే నాథుడే లేడని స్థానికులు పేర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమస్యను పరిష్కరించుకోవాలంటే మండలస్థాయి అధికారులను, కార్యదర్శిలను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

పల్లెల్లో కనుమరుగవుతున్న కాడెద్దులు..!

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పొలం దున్నాలన్నా.. విత్తాలన్నా.. పండించిన పంట ఇంటికి చేరాలన్నా ఒకప్పుడు కాడెద్దులు కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకం. రైతు ఇంటి ముంగిట రంకెలు వేస్తూ, మెడలో గంటలతో చిరుసవ్వడి చేస్తూ, యజమానికి విశ్వాసం చూపుతూ, సాగు పనుల్లో చేయూతనందించేవి ఎద్దులు. కష్టపడి పని చేసే మనిషిని ఎద్దులా చాకిరి చేస్తారంటారు.. గ్రామీణ వ్యవసాయ జీవనంలో ఎద్దు కష్టం అలాంటిది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, సాగులో పెరిగిన యాంత్రీకరణ, అసలు వ్యవసాయమే వదిలేస్తున్న రైతుల సంఖ్య పెరగడం, గ్రామాలొదిలి పట్టణాలకు పెరిగిన వలసలతో ఆలనాపాలనకు వీలు లేకపోవడం వంటి కారణాలు ప్రస్తుతం ఎద్దుల మనుగడను ప్రశ్నార్థకంగా మారాయి. ఈ కాలంలో ఎద్దుల పెంపకందారుల్లో ఎక్కువ మంది సంపాదన కోసమే వాటిని వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఎడ్ల స్థానంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎద్దులతో ఒకరోజు చేసే పని యంత్రాలతో రెండు మూడు గంటల్లో జరిగిపోతోంది. దీంతో విత్తనం మొదలు పంట కోత వరకూ యంత్రాలనే వినియోగిస్తున్నారు. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నది. అయినా సమయం ఆదా అవుతుండడంతో అధిక శాతం మంది రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఒకప్పుడు రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన ఎద్దులు నేడు క్రమంగా కనుమరుగవు తున్నాయి.



ఎద్దులతో పొలం దున్నుతున్న రైతు (ఫైల్‌ఫొటో)

గతంలో ప్రతి రైతుకూ ఎద్దులు..

వ్యవసాయంలో ఎద్దులతో రైతులకు విడదీయరాని బంధం ఉంది. ఇది వరకు గ్రామాల్లో రెండు, మూడు ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు కనీసం ఒక జత ఎద్దులు ఉండేవి. ఎద్దులు లేని రైతులు అద్దెకు పిలిపించుకుని పొలాలను తయారు చేసుకునేవారు. రానురాను దుక్కి దున్నడం నుంచి పంట ఇంటికి చేర్చేవరకు ప్రతి పని యంత్రాలతో జరిగి పోతుండడంతో కాడెద్దులపై రైతులు మొగ్గు చూపడంలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో జత ఎద్దులను కొనాలంటే రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకు ధర పలుకుతున్నాయి. అంత పెట్టుబడి పెట్టి కాడెద్దులను తీసుకొచ్చి వాటిని పోషించడం తలకు మించిన భారం అవుతోందని యంత్రాల వైపు రైతన్నలు చూస్తున్నారు.

భారమవుతున్న పశుపోషణ..

కాడెద్దులను పోషించడం రైతులకు భారంగా మారింది. ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంది. ఇక దాణా, పచ్చిగడ్డి, సంరక్షణ ప్రతీదీ రైతుకు భారమవుతోంది. రైతులు ఉన్న ఎద్దులను అమ్మేసి యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో గ్రామానికి ప్రతి రైతుకు ఎద్దులు ఉండేవి. పశుపోషణ భారంగా అవుతోందని యంత్రాలతో త్వరగా పని అవుతోందని రైతులు అభిప్రాయడుతున్నారు.

యాంత్రీకరణ దిశగా వ్యవసాయం..

నూతన యాంత్రీకరణ దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయంలో ప్రతి పనికి యంత్రాలు వచ్చాయి. దుక్కి దున్నడం మొదలు దమ్ము చేసి వరినాట్లు వేసే వరకూ. వ్యవసాయం సులభతరంగా యంత్రాలను ఉపయోగిస్తున్నారు. కోత కోసి ఇంటికి చేర్చే వరకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.



ఏటూరు కాలువ వద్ద నీటిని విడుదల చేస్తున్న నాయకులు

ఏటూరు ఛానల్‌కు నీరు విడుదల

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఏటూరు ఛానల్‌కు సోమవారం కెసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రాజోలు ఆనకట్ట నుండి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే అన్నారు. హైవే రోడ్డు పనుల్లో భాగంగా నీటి విడుదల ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం మరమతు పనులు పూర్తి కావడంతో నీటిని విడుదల చేశామన్నారు. రైతులు పంటలు సాగు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కెసి కెనాల్ ఎఇ గురు మోహన్‌రెడ్డి, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ అధ్యక్షులు పి.సత్య వేమారెడ్డి, టిడిపి నాయకులు చంద్రఓబుల్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, మేకల బాబు, వీరశేఖర్‌రెడ్డి, పివి నారాయణ యాదవ్, గోసుల వీరారెడ్డి, నారపరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందికి వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలల్లో, కళాశాలలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది(నాన్ టీచింగ్)కి వేతనాలను పెంచాలని సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ కోరారు. ఆ మేరకు సోమవారం ఎంఇఒ కార్యాలయంలో ఆయన డిప్యూటీ ఇఒ మీనాక్షికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఇఎస్ఐ, పిఎఫ్ కట్టాలని సూచించారు. కార్మిక చట్టం 1948 ప్రకారం ప్రయివేట్ విద్యాసంస్థల్లోని పాఠశాలలు, కళాశాలలో బోధనేతర సిబ్బందిగా పని చేస్తున్న వారికి కనీస వేతనం పొందేందుకు అర్హులని తెలిపారు. వారికి నెలకు కనీస వేతనం రూ.15,000 ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు ప్రతి నెల వారికి రూ.366- 390లోపు కట్టాలని తెలిపారు. విద్యార్థుల సర్టిఫికెట్లులో ఏదైనా పొరపాటు జరిగితే వారిని నిందిస్తున్నారని, న్యాయం చేయాలని ఆయన కోరారు.

కొత్తపల్లి పశు వైద్యాధికారిగా భారతి

ప్రజాశక్తి - ముద్దనూరు

కొత్తపల్లి పశువైద్యాధికారిగా డాక్టర్ మార్తల భారతి భాధ్యతలు చేపట్టారు. ఆమె వేముల మండలం గొల్లల గూడూరు నుండి బదిలీపై కొత్తపల్లికు వచ్చారు. అనంతరం డాక్టర్ మార్తల భారతి మాట్లాడుతూ పాడి పరిశ్రమకు చేయూత నిచ్చేందుకు ప్రభుత్వ పథకాలను పాడి రైతులు, పశు యజమానులకు చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామం లోని ప్రజ లకు అందుబాటులో ఉంటూ పశువులు, జీవాలకు సంబంధించిన వ్యాధులకు సకాలంలో వైద్య సేవలు అందిస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు, పశు వైద్య సేవ లను పాడి రైతులు, పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రెండిళ్లల్లో చోరీ

- ఆరు తులాలు బంగారు, రూ.10లక్షలు అపహరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో ఆదివారం అర్ధరాత్రి రెండిళ్లల్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆయా ఇళ్లల్లో ఆరు తులాల బంగారం, రూ.10 లక్షల నగదు దోచుకెళ్లారు. ఆ సమయంలో ఇంటి యజమానులు ఇంటికి తాళం వేసి ఉన్నారు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కూనవారిపల్లె రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చంద్రనాయక్

అందుబాటులో యూరియా నిల్వలు

ప్రజాశక్తి - ఖాజీపేట: రైతులు మోతాదుకు మించి యూరియాను అధికంగా వినియోగిస్తున్నారని, తద్వారా భూసారం నశించిపోతుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కూనవారిపల్లె రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు ఎకరాకు 100 కిలోల చొప్పున యూరియా వినియోగించాలని సూచించారు. అది కూడా మూడు విడతలుగా వాడాలన్నారు. జిల్లాలో తగినంత యూరియా అందుబాటులో ఉందన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక అధికారి గోవర్ధన్, ఎఒ నాగార్జున పాల్గొన్నారు.